సాక్షి నంద్యాల

శనివారం, 18, నవంబర్, 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన మాణిక్యగడ్డం రూ.1.01,016 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డికి అందజేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం నిత్యకళావేదికపై డాక్టర్ పిల్లి జాహ్నవి బృందం, బిక్కవోలు కళాకారుల కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది.



పేదలకు 'ఆరోగ్య' రక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరాలు విజయవంతంగా ముగిశాయి. వందలాది వైద్య శిబిరాల్లో లక్షలాది మంది ప్రజలు ఉచితంగా వైద్యసేవలు అందుకున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు



పోలీస్ దర్బార్‌లో ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి ఎస్పీకి వినతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడి గురికాకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ సూర్యమౌళి ఆర్ఎస్ఐ కాశీచరణ్ పాల్గొన్నారు. అలాగే పోలీసు దర్బార్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత ప్రతి నెల పోలీసు దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని ఈ అవకాశాన్ని జిల్లా సాయుధ పోలీసు బలగాలు సద్వినియోగం చేసుకొని వారి సమస్యలను తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం సిబ్బంది వారికి విధుల్లో ఎదురయ్యే సమస్యలు తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకట రాముడు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ డీఎస్పీ రంగముణి సిబ్బంది పాల్గొన్నారు.

స్థిరంగా ఎండు మిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): నంద్యాల టెక్కె మిర్చి మార్కెట్ యార్డులో ఎండు మిర్చి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం సూపర్-10 రకం మిర్చి కొనుగోళ్లు నిర్వహించారు. ఈ రకం గరిష్ట ధర క్వింటాలు రూ.23,500, కనిష్ట ధర రూ.19,000, మోడల్ ధర రూ.22,200 పలికినట్లు మార్కెట్‌యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారస్తుల వద్దే సరకు అమ్ముకుని మంచి ధరను పొందాలని సూచించారు.

మైనింగ్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలోని భూగర్భ గనుల శాఖా కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ కార్యాలయంలో అసిస్టెంట్ జియాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లుపై ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు గుంటూరులోని తన నివాసంతో పాటు పట్టణంలోని మైనింగ్ కార్యాలయంలోతనిఖీలు నిర్వహించారు.

ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

నంద్యాల(సిటీ): భారత్-ఆస్ట్రేలియా దేశాల మధ్య జరిగే క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను అభిమానులు తిలకించేందుకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 19న ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పట్టణంలోని ఎస్పీజీ గ్రౌండ్స్‌లో పెద్ద స్క్రీన్లను (ఫ్యాన్ పార్క్) ఏర్పాటు చేస్తున్నారు. ఈ మైదానంలో దాదాపు 10వేల మంది వీక్షించే అవకాశం ఉంది. ప్రవేశం ఉచితమని, క్రికెట్ అభిమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.

శ్రీశైలంలో కార్తీక వెలుగులు



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసం సందర్భంగా పలువురు భక్తులు పరమేశ్వరుడు కొలువైన శ్రీగిరికి చేరుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్నారు. కార్తీకమాస మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని పలువురు భక్తులు వేకువజామున్నే పుణ్యస్నానాలు ఆచరించి, దేవస్థానం ఏర్పాటు చేసిన గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాఢవీధిలో దీపారాధన చేశారు. అనంతరం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అలాగే ప్రధాన ఆలయ ధ్వజస్తంభం వద్ద సంప్రదాయ బద్ధంగా వెలిగించిన ఆకాశ దీపాన్ని భక్తులు వీక్షించారు.

పుడమి అంతా ఆనందం

- నెరవేరిన పేదల దశాబ్దాల కల
- జిల్లాలో 2,376 మంది పేదలకు 3,420.87 ఎకరాల భూ పంపిణీ
- 6,454 మందికి 10,959.69 ఎకరాలపై అసైన్డ్ హక్కు
- 40,028.246 ఎకరాల ఇనామ్ భూములపై 22,646 మందికి సంపూర్ణ హక్కు
- లబ్ధిదారులకు పట్టాలను అందజేసిన కలెక్టర్ మనజీర్, జెడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



పేదలకు భూ యాజమాన్య హక్కు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తదితరులు

నంద్యాల: నిన్నటి వరకు పొలం ఉన్నా సర్వ హక్కుల్లేవు. సాగు చేసుకుంటున్నా భద్రత లేదు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. ఎన్నో ప్రభుత్వాలు మారినా వారి సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. ఎట్టకేలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దశాబ్దాల పేదల కల నెరవేరింది. వేల మంది పేదలు భూ హక్కు పత్రాలు అందుకుని రైతులుగా మారారు. అసైన్డ్, ఇనామ్ భూములపై సర్వ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం భూ యాజమాన్య హక్కు పత్రాల పంపిణీ చేయడంతో పేదల ఇంట ఆనందం వెల్లివిరిసింది. శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో బహిరంగ సభ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20,24,709 మందికి లబ్ధి చేకూరుస్తూ 35,44,866 ఎకరాల భూములకు సర్వ హక్కులు కల్పిస్తూ భూ యాజమాన్య హక్కు పత్రాల పంపిణీ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ప్రభుత్వ మైనార్టీ సలహాదారుడు హబీబుల్లా, బనగానపల్లె శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య, వైఎస్సార్సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వర రెడ్డి, రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూములపై సర్వహక్కులు కల్పిస్తూ అర్హులైన పేదలకు భూ పట్టాల పంపిణీ చేయడంతో పేదల ఇంట పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూములకు సంబంధించి డోన్ డివిజన్‌లో 2,296 మంది లబ్ధిదారులకు 3,843.96 ఎకరాలు, ఆత్మకూరు డివిజన్‌లో 3,455 మంది లబ్దదారులకు 6017.36 ఎకరాలు, నంద్యాల డివిజన్‌లో 703 మంది లబ్దదారులకు 1,098.37 ఎకరాల భూములకు సర్వ హక్కులు కల్పించామన్నారు.

➤ భూమి లేని నిరుపేదలకు నంద్యాల డివిజన్‌లో 531 మంది లబ్ధిదారులకు 705.43 ఎకరాలు, ఆత్మకూరు డివిజన్‌లో 129 మంది లబ్ధిదారులకు 154.30 ఎకరాలు, డోన్ డివిజన్‌లో 1,716 మంది లబ్ధిదారులకు 2561.14 ఎకరాలు, కొత్త డీ పట్టాలను జిల్లాలో 2,376 మంది లబ్ధిదారులకు 3,420.87 ఎకరాలు పంపిణీ చేశామన్నారు. గ్రామ సర్వీస్ ఇనామ్ భూములకు సంబంధించి డోన్ డివిజన్‌లో 5,319 మంది లబ్ధిదారులకు 9,223.956 ఎకరాలు, ఆత్మకూరు డివిజన్‌లో 6,527 మంది లబ్ధిదారులకు 1,1157.69 ఎకరాలు, నంద్యాల డివిజన్‌లో 10,800 మంది లబ్ధిదారులకు 19,646.6 ఎకరాలు సర్వీస్ ఇనామ్ తొలగించడం ద్వారా 22,646 మంది లబ్ధిదారులకు 40,028.246 ఎకరాలు లబ్ధి జరిగిందన్నారు. ఎస్సీ కమ్యూనిటీ వారికి శ్మశాన వాటికలకు సంబంధించి 10 ఎకరాల 10 సెంట్లు భూమిని కేటాయించామన్నారు. అలాగే జగనన్న శాశ్వత భూ హక్కు భూ పథకం కింద రెండవ దశ రీసర్వేలో చేపట్టిన 73 గ్రామాల్లో 38,754 మంది రైతులకు 1.53 లక్షల ఎకరాలకు సంబంధించిన భూహక్కు పత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు కలెక్టర్, ప్రజాప్రతినిధులు పట్టాలు పంపిణీ జేశారు.

➤ బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్లకు పైగా అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు సర్వహక్కులు కల్పిస్తూ సీఎం జగన్ మోహన్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నిర్ణయంతో వందల మంది పేద రైతులకు మంచి జరుగబోతోందని ఆలోచన చేసిన సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలపాలన్నారు. రైతు సంక్షేమానికి భరోసా ఇవ్వడంతో పాటు వారి భూములకు రక్షణ కల్పించడం దేశానికే ఆదర్శమన్నారు. దశాబ్దాలుగా భూములపై ఉన్న వివాదాలను పరిష్కరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమాన్ని భూముల రీ సర్వే చేపట్టి రైతులకు మేలు చేసిన ప్రభుత్వం తమదని గర్వంగా చెబుతున్నానన్నారు.

➤ జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఉన్న భూ సమస్యలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చరమ గీతం పాడుతూ భూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. భూమిలేని దళిత, బడుగు బలహీన వర్గాలకు, ఇప్పటికే అసైన్డ్ గ్రామ సర్వీస్ ఇనామ్, ఎస్సీ కార్పొరేషన్ (ఎల్పీఎస్) భూములు పొందిన వారికి వాటిపై సర్వ హక్కులు కల్పించే భూ యాజమాన్య హక్కు పత్రాల పంపిణీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. రెవెన్యూ వ్యవస్థలో ఇదొక చారిత్రాత్మక మార్పులకు నాంది అవుతుందన్నారు.

➤ ప్రభుత్వ మైనార్టీ సలహాదారుడు హబీబుల్లా మాట్లాడుతూ భూమిలేని దళిత, బడుగు, బలహీన వర్గాలకు, పేదలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములను అందజేయడం శుభపరిణామమన్నారు. ఆయా కుటుంబాలకు ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న మానసిక వ్యథను తొలగించి వారి జీవితాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన వెలుగులు నింపారన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



34 ఏళ్ల కింద ల్యాండ్ సీలింగ్ పథకంతో ఎస్సీ కార్పొరేషన్ వారు ఎకరా పొలం ఇచ్చారు. అప్పటి నుంచి పొలానికి సంబంధించిన ఒరిజినల్ పట్టాలు కార్పొరేషన్‌లోనే ఉంచుకున్నారు. గత కొన్ని ఏళ్ల నుంచి వ్యవసాయ కూలీగా చేసుకుంటూ జీవనం చేస్తున్నాను. గత ప్రభుత్వాలు తమను ఏనాడు పట్టించుకోలేదు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి కార్పొరేషన్‌లో తీసుకున్న రుణాన్ని మొత్తాని మాఫీ చేశారు. భూమిపై సర్వహక్కులు కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఆవుల నీలమ్మ, మంచాలకట్ట గ్రామం

రూ.10 లక్షల విలువ చేసే భూమి సొంతం



మాది నిరుపేద కుటుంబం. మా తాత గారి కాలం నుంచి మాకు సెంటు భూమి కూడా లేదు. కానీ నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి రూ. 10 లక్షల విలువ చేసే 1.02 ఎకరాల భూమిని నా పేరు మీద ఉచితంగా అందజేశారు. అంతే కాకుండా మాకు సొంత ఇల్లు కూడా లేదు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ఇల్లు మంజూరు కావడంతో మేము కొత్త ఇల్లును కట్టుకున్నాం. పొలం, ఇల్లు అందజేసిన ముఖ్య మంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని జీవితాంతం గుర్తు పెట్టుకుంటాం. – బి. పుల్లమ్మ, పలుకూరు గ్రామం, బనగానపల్లె మండలం

నేను ఇక రైతునే



నేను, నా భర్త వెంకటేశ్వర్లు నాపరాయి గని పనికి వెళ్లి కుటుంబాన్ని పోషించుకుటున్నాం. నాకు ఇద్దరు పిల్లలు. పనికి వెళితే కాని పూట గడవని పరిస్థితి. మాకు సెంటు స్థలం కూడా లేదు. ఈ రోజు పేదలకు భూపంపిణీ కార్యక్రమం కింద నిరుపేదనైన నన్ను గుర్తించి నా పేరు మీద 2.43 ఎకరాలను కలెక్టర్ అందజేశారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి దయవల్ల నేను కూడా ఈ రోజు నుంచి రైతునే. చేసిన సాయాన్ని పేదలు ఎప్పుడూ మరచిపోరు. సాయం చేసిన వారిని గుండెల్లో పెట్టుకుంటారు.

– ఆదిలక్ష్మి, పలుకూరు, బనగానపల్లె మండలం

అభివృద్ధే లక్ష్యంగా పాలన



నూతన ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ప్రారంభ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శామూన్, ఎమ్మెల్యే శిల్పా రవి, ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

నంద్యాలటౌన్: అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన కొనసాగుతుందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నూతనంగా రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, కలెక్టర్ మనజీర్‌జిలానీ శామూన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన నీటి సమస్య ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ నిర్వహణ ద్వారా పరిష్కారం అవుతుందన్నారు. కార్యాలయాన్ని కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించారన్నారు. గతంలో ఈ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో రూ.1.10కోట్ల రూపాయల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించామన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, ఈఈ మనోహర్, డీఈ ఉమాకాంత్‌రెడ్డి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావళి, కౌన్సిలర్స్ కలాం బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్ అమతరాజ్ సోమశేఖర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశ భవనంలో జరుగనున్న సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్యం, వ్యవసాయం, గృహ నిర్మాణ శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశానికి కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు హాజరు కావాలని సీఈఓ పేర్కొన్నారు.

క్వింటా ఉల్లి రూ.3,689

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి పోటెత్తుతోంది. లేట్ ఖరీఫ్‌లో సాగు చేసిన ఉల్లి దిగుబడులు కోతకు వస్తుండటంతో మార్కెట్‌కు ఉల్లి భారీగా వస్తున్నట్లు సమాచారం. ఈ నెల 16న మార్కెట్‌కు 9,370 క్వింటాళ్లు, 17న 9,321 క్వింటాళ్లు మార్కెట్‌కు వచ్చింది. గరిష్ఠంగా రూ.5,500 వరకు వెళ్లిన ఉల్లి ధర క్రమంగా తగ్గుతోంది. శుక్రవారం ఉల్లి ధర గరిష్టంగా రూ.3,689 పలికింది. కనిష్ఠ ధర రూ.802, మోడల్ ధర రూ.3,006 నమోదైంది. మహారాష్ట్రలోను, తాడేపల్లిగూడెంలోను ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టినట్లు సమాచారం.

841.20 అడుగులుగా శ్రీశైలం డ్యాం నీటి మట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 841.20 అడుగులకు చేరుకుంది. జలాశయానికి వరదప్రవాహం లేకపోవడం, దిగువ ప్రాంతాలకు ప్రతిరోజూ నీటి విడుదల జరుగుతుండడంతో నీటిమట్టం రోజురోజుకు తగ్గుతుంది. గురువారం నుంచి శుక్రవారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 6,044 క్యూసెక్కుల నీరు విడుదలైంది. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 0.797 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జునసాగర్‌కు 2,019 క్యూసెక్కులు, బ్యాక్ వాటర్ నుంచి ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 490 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,013 , కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రసుత్తం జలాశయంలో 63.6876 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇది ఇలా ఉండగా సప్తనదుల సంగమేశ్వరం వద్ద కృష్ణా జలాలు తగ్గుముఖం పడుతుండటంతో పురాతన ఆలయం జలాధివాసం పూర్తిగా వీడుతోంది. త్వరలో పూజలు మొదలుకానున్నాయి.

బూత్ స్థాయి అధికారులు నిర్లక్ష్యధోరణి వీడాలి

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఓటరు జాబితా సవరణలో బూత్ స్థాయి అధికారులు నిర్లక్ష్య ధోరణి విడనాడి స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ బీఎల్‌ఓలు, ఏఈఆర్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఆళ్లగడ్డ, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గాల బూత్ స్థాయి అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దారులతో ఓటర్ల జాబితా సవరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణకు సంబంధించి బూత్ స్థాయి అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోందని పనితీరు మెరుగుపరుచుకుని పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లన్నింటినీ ఆదివారం లోపు పూర్తి చేయాలని బీఎల్‌ఓలు, సంబంధిత ఏఈఆర్‌ఓలను ఆదేశించారు. చిన్న పొరపాటు జరిగిన సంబంధిత అధికారులందరూ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సుమోటోగా ఓటర్లను తొలగించకుండా ప్రతి ఓటర్‌కు సంబంధించి పక్కా రిపోర్టును రిజిస్టర్‌లో నమోదు చేసి భద్రపరుచుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఉన్న విద్యా సంస్థల్లో 18 ఏళ్లు నిండిన యువతీ యువకుల నూతన ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన బీఎల్‌ఓలకు సంజాయిషీ మెమోలను జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

రైలు ప్రయాణికులకు మరిన్ని వసతులు

- రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్



రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తదితరులు

డోన్ రూరల్: రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం డోన్ రైల్వే స్టేషన్‌లో మరిన్ని వసతులు కల్పిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. శుక్రవారం ఆయన డోన్ రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. రన్నింగ్ రూం, రైల్వే స్టేషన్, బుకింగ్ కౌంటర్ అన్నింటిని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టిందన్నారు. గుంతకల్ డివిజన్ మేనేజర్ అనుష్ అగర్వాల్ మాట్లాడుతూ డోన్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. డబుల్ లేన్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. పట్టణంలో నంద్యాల గేట్, కర్నూలు గెట్‌లకు అండర్ పాస్ బ్రిడ్జిలకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు కూడా జరుగుతాయన్నారు. కరోనా విపత్తులో నిలిచిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరిస్తామన్నారు. సమావేశంలో స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది, రైల్వే ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వందే భారత్‌ను డోన్‌లో నిలపాలి..

హైదరాబాద్ – బెంగళూరు మధ్య కొత్తగా ఏర్పాటు చేసిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును డోన్‌లో స్టాపింగ్‌కు అనుమతితో ఇవ్వడంతో పాటు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్‌లు రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రయాణికులకు సౌకర్యంగా ఉన్న వందే భారత్‌ను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమ బావుటా

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు



గత కొన్నేళ్లుగా నిద్రావస్థలో ఉన్న విద్యా వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం తట్టిలేపి సమూలమైన మార్పులు తీసుకొచ్చింది. గతంలో పాఠశాలల్లో అధ్వాన్న పరిస్థితులు నెలకొని ఉండేవి. ప్రస్తుతం నాడు-నేడు పథకంతో కార్పొరేట్ స్కూళ్లను మరిపించేలా ఉన్నాయి. అప్పటి, ఇప్పటి వాతావరణానికి చాలా తేడా కనిపిస్తోంది. మండల స్థాయి విద్యాశాఖాధికారి నుంచి ప్రిన్సిపాల్ సెక్రటరీ వరకు పాఠశాలలపై పర్యవేక్షణ పెరగడంతో విద్యా ప్రమాణాలు మెరుగయ్యాయి. ప్రభుత్వం ఫేసియల్ యాప్ తీసుకురావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాల్సి వస్తుంది. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం తదితర వస్తువులు అందిస్తుంది. విద్యపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భేష్‌గ్గా ఉన్నాయి.

– బాల సుబ్బారెడ్డి, హెచ్ఎం, కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల




పేద విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా విద్యా రంగానికి పెద్దపీట వేసి పేద విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించారు. నాడు - నేడు కింద పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లను తలపిస్తున్నాయి. తరగతి గదులు, టాయిలెట్లు, ప్రహరీలు, మైదానాలు ఎంతో అభివృద్ధి చెందాయి. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటున్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలతో పాటు విలువలతో కూడిన బోధన అందిస్తున్నాం. అంతే కాకుండా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించి వారికి అదనపు తరగతులు నిర్వహించడమే కాకుండా వంద శాతం ఉత్తీర్ణతకు పాటుపడుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు బోధనా శైలిలో మార్పులు తీసుకువచ్చాం.

– కేవీ.సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ పాఠశాల చాపిరేవుల, నంద్యాల మండలం

వసతులు ఎంతో మెరుగుపడ్డాయి



గతంలో ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలకు కేంద్రంగా ఉండేవి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు లేవు. తాగేందుకు నీటి సౌకర్యం లేని పాఠశాలలు కూడా చాలా ఉండేవి. ఈ నాలుగేళ్లలో నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలే మారిపోయాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యకు పెద్దపీట వేయడంతో వసతులు ఎంతో మెరుగుపడ్డాయి. నేను ప్రస్తుతం పని చేస్తున్న సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలకు రెండో విడత నాడు- నేడు కింద రూ. 30 లక్షల మంజూరై పనులు కొనసాగుతున్నాయి. గతంలో నేను పని చేసిన ఆర్.బుక్కాపురం పాఠశాలకు రూ. 21 లక్షలు మంజూరై తరగతి గదుల నిర్మాణంతో పాటు డెస్కులు ఇచ్చారు. వసతుల మధ్య విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటుంటే ఎంతో ఆనందంగా ఉంది.

– వైవీ సుబ్బారెడ్డి, హెచ్ఎం సంజీవనగర్ ప్రాథమిక పాఠశాల, బేతంచెర్ల పట్టణం

క్లుప్తంగా

అటవీ భూముల సంరక్షణ అందరి బాధ్యత

● జిల్లా అటవీశాఖ అధికారి శివశంకర్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: అటవీ భూముల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీ శాఖ అధికారి పి.శివశంకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం డీఎఫ్ఓ కార్యాలయంలో కర్నూలు డివిజన్‌లోని ఎఫ్‌బీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను రక్షించుకోవడానికి క్రమం తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ లైన్స్, ఫైర్ పిట్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అటవీ భూముల సరిహద్దు రాళ్లు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. ప్రత్యామ్నాయ వనీకరణ పథకం పనులు, బిల్లులు, నిధుల ఖర్చులను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

అర్బన్ కో–ఆపరేటివ్ సొసైటీ అక్రమాలపై విచారణ

● జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు ఆదేశం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ సొసైటీలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు ఏపీ కో–ఆపరేటివ్ చట్టం సెక్షన్–51 కింద విచారణకు ఆదేశిస్తూ జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. పాతబస్టాండ్‌లోని ఈ సొసైటీలో అక్రమాలు పెద్దఎత్తున జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పిటీషన్ ఎంక్వైరీ కింద సబ్ డివిజినల్ సహకార అధికారి నాగరమణయ్య నేతృత్వంలో బృందం విచారణ జరిపింది. ఈ విచారణలో అక్రమాలు ఏ స్థాయిలో జరగాయి.. బాధ్యులెవ్వరు అనే దానిపై స్పష్టత రాలేదు. దీంతో పూర్తి స్థాయి విచారణకు సెక్షన్–51 కింద విచారణ జరిపించాలని సబ్ డివిజినల్ సహకార అధికారి నాగరమణయ్య డీసీఓకు రిపోర్టు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి శిరీషను విచారణ అధికారిగా నియమిస్తూ సెక్షన్–51 విచారణకు ఆదేశాలు ఇచ్చారు. కాగా కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ సొసైటీకి ప్రస్తుతం నాన్ అఫీషియల్ పాలక వర్గం ఉంది. ఈ పాలక వర్గాన్ని రద్దు చేసి అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీ కమిటీని నియమించాలని కోరుతూ... సహకార శాఖ కమిషనర్‌కు డీసీవో రిపోర్టు పంపనున్నారు.

జాతీయ విద్యావిధానంపై అవగాహన

కర్నూలు కల్చరల్: విద్యార్థుల అనుకూల విద్యే జాతీయ విద్యా విధానం –2020 అని కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం డైరెక్టర్ సోమయాజులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు)లో ప్రిన్సిపాల్ జి.హేమంత్ అధ్యక్షతన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు జాతీయ విద్యా విధానం – 2020పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సోమయాజులు మాట్లాడుతూ భాషా జ్ఞానం కంటే శాస్త్ర జ్ఞానం ముఖ్యమన్నారు. గౌరవ అతిథి క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి సాయిగోపాల్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసులు, కళాశాల అధ్యాపకులు ఆర్.ఆదినారాయణ రెడ్డి, వై.శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ‘ఆరోగ్య’ రక్ష

● ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు
● పేదల ముంగిటకే వచ్చిన వైద్యులు, సిబ్బంది
● శిబిరాలతో లక్షలాది మందికి లబ్ధి
● వైద్యపరీక్షలు, మందులు, చికిత్స ఉచితం
● జిల్లా వ్యాప్తంగా 635 వైద్య శిబిరాలు, 2,21,583 మందికి చికిత్స


వైద్యశిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. సాధారణ జ్వరం వస్తే కూడా ఎక్కడో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే అవసరం లేకుండా ఉన్న ఊళ్లోనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద సెప్టెంబర్ 30వ తేదీ నుంచి జిల్లాలో ప్రారంభమైన ఉచిత వైద్యశిబిరాలు విజయవంతంగా ముగిశాయి. వందలాది వైద్యశిబిరాల్లో లక్షలాది మంది ప్రజలకు వైద్యసేవలు అందించారు. ఫలితంగా జబ్బు ఉన్నా ఆసుపత్రికి వెళ్లే స్థోమత, ఓపిక లేకుండా ఇంట్లోనే ఉండిపోయిన పేదలు ఈ వైద్యశిబిరాల ద్వారా చికిత్స పొందారు.

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, రెండు ఏరియా ఆసుపత్రులు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 426 విలేజ్ హెల్త్ క్లినిక్స్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఉన్నాయి. ఆయా ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు ఏఏ వ్యాధులు ఉన్నాయి, వారికి మరింత మెరుగైన ఆరోగ్యం ఎలా అందించాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం గత సెప్టెంబర్ 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 15 రోజుల ముందుగా వలంటీర్లు కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఏఎన్ఎంలు, కమ్యూనిటీ ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఎవరికి ఏఏ వ్యాధులు ఉన్నాయో గుర్తించి, వైద్యపరీక్షలు చేసి జాబితా తయారు చేశారు. ఈ జాబితా మేరకు ఆయా గ్రామాలు, వార్డుల పరిధిలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాలకు వారిని తరలించారు. దాదాపు 45 రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఏ వైద్యశిబిరం చూసినా సగటున 400 మంది చొప్పున హాజరై వైద్యపరీక్షలు, చికిత్సలు చేయించుకుని మందులు తీసుకెళ్లారు. ఇందుకోసం సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా కేంద్రంలోని సర్వజన వైద్యశాల, మెడికల్ కళాశాలల నుంచి స్పెషలిస్టు వైద్యులను నియమించారు. వారి పరిధి గాని వ్యాధులు ఏమైనా ఉన్న వారిని జిల్లా కేంద్రంలోని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేశారు.

635 వైద్యశిబిరాల్లో 2,21,583 మందికి చికిత్స

జిల్లా వ్యాప్తంగా వార్డు, గ్రామ సచివాలయ పరిధిలో 45 రోజుల పాటు 635 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో 2,21,583 మంది ప్రజలు ఓపీ ద్వారా చికిత్స తీసుకున్నారు. ఇందులో 1,04,933 మంది పురుషులు, 1,16,649 మంది స్త్రీలు ఉన్నారు. 2,21,307 మందికి వైద్యులు మందులు అందజేశారు. ఇందులో 32,078 మందికి కంటి వెలుగు కింద చికిత్స చేశారు.

78,868 మందికి వ్యాధుల నిర్ధారణ

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలల్లో చికిత్స పొందిన 2,20,248 మందిలో 78,868 మందికి వివిధ వ్యాధులున్నట్లు వైద్యులు గుర్తించారు. ఇందులో బీపీ 9,667, షుగర్ 4,316, కంటివ్యాధులు 3,031, కుష్టు 722, టీబీ 238, రక్తహీనత 58,486 మందికి ఉన్నట్లు నిర్ధారించారు. వీరిలో 2,181 మందిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేశారు. ఈ మేరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని పేయింగ్ బ్లాక్‌లో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులు చికిత్స చేస్తున్నారు. అవసరమైన ఆసుపత్రిలో చేర్చుకుని వైద్యమందిస్తున్నారు.

విశేష స్పందన వచ్చింది



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. ప్రతిచోటా వైద్యశిబిరాలకు విశేష స్పందన లభించింది. ప్రతి వైద్యశిబిరానికి సగటున 400 మంది దాకా చికిత్స కోసం వచ్చారు. ఈ కార్యక్రమం ఎంతో వినూత్నమైనది. సదుద్దేశంతో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు జరిగింది. జబ్బులకు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఊళ్లోకే వైద్యులు రావడంతో వైద్యం చేయించుకోవడం ప్రజలకు సులభమైంది.

–డాక్టర్ రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

ప్రత్యేక చికిత్స అందించాం



జగనన్న ఆరోగ్యశ్రీ వైద్య శిబిరాల్లో అక్కడి వైద్యులు రెఫర్ చేసిన వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రత్యేకంగా చికిత్స చేయించాం. మొత్తం 2,181 మందికి రెఫర్ చేయడంతో ప్రతిరోజూ కొద్ది మంది చికిత్స కోసం వస్తున్నారు. వారికి పేయింగ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓపీ ద్వారా స్పెషలిస్టు వైద్యులచే చికిత్స చేయిస్తున్నాం. అవసరమైన వారిని ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స చేయించాం. బీపీ, షుగర్ జబ్బులు బయటపడ్డ వారికి ఇక్కడ మరిన్ని వైద్యపరీక్షలు చేయించి వైద్యులచే సూచనలు, సలహాలు అందించాం.

–డాక్టర్ ఎం. భాస్కరరెడ్డి, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

గిరిజనులు వ్యవసాయంలో రాణించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: చెంచు గిరిజనులు ఆధునిక పద్ధతులు పాటించి వ్యవసాయంలో రాణించాలని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఐటీడీఏ ప్రాంగణంలోని యూత్‌ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం చెంచుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసే క్రమంలో భాగంగా వారి సామర్థ్యాల పెంపుపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న జన జాతీయ గౌరవదివస్–ట్రైబల్ ప్రైడ్ డే లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పీఓ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ అటవీ భూ హక్కుల చట్టం ప్రకారం ప్రభుత్వం పట్టాలుగా ఇచ్చిన భూముల్లో చేసే వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఎంతో అవసరమన్నారు. ఆధునిక పద్ధతులపై శిక్షణ పొంది పంటపొలాలను అభివృద్ధి పరచుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకుకొని అనువైన పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారుల సహకారంతో వ్యవసాయం చేసుకోవాలని, పండ్ల తోటల పెంపకంతో మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని గిరిజనులకు సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఓఎస్‌డీ ఆర్.కొండలరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆంజనేయులు, హార్టికల్చర్ అధికారి బీసీ ధనుంజయ, ఏపీఓ సురేష్‌కుమార్, ఫారెస్ట్ రైట్స్ చెంచుగిరిజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

అలరించిన అష్టావధానం

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం శుక్రవారం బృహత్ ద్విసహస్రావధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ వారిచే నిర్వహించిన అష్టావధానం కార్యక్రమం భక్తులను అలరించింది. ముందుగా బృహత్ ద్విసహస్రావధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు, అధికారులు జ్యోతిప్రజ్వలను చేశారు. అనంతరం బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ అష్టావధానం చేశారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ పీటీజీవి రంగాచార్య సభా సమన్వయం, పృచ్ఛకులుగా వ్యవహరించారు. అలాగే దత్తపదికి బ్రహ్మశ్రీ పశర్లపాటి బంగారయ్య శర్మ వ్యవహరించగా, సమస్యపురాణానికి మాడుగుల శివశ్రీశర్మ అవధాని, నిషిద్ధాక్షరికి చింతా రామకృష్ణరావు, వర్ణనకు సురభి శంకరశర్మ అవధాని పృచ్ఛకులుగా వ్యవహరించారు. అలాగే దత్తాత్రేయశర్మ అప్రస్తుత ప్రసంగాన్ని చేశారు. దేవస్థాన శ్రీశైలప్రభ మాసపత్రిక సంపాదకులు డా.సి.అనిల్‌కుమార్ ప్రశ్నకు మాటకు సంబంధించిన అంశంపై పృచ్ఛకులుగా వ్యవహరించారు.


అష్టావధానం కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఈఓ, బ్రహ్మశ్రీ మాడుగుల

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలి

● ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి అక్కినేని వనజ

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వ విధానాలపై మహిళలు ఐక్యంగా పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి అక్కినేని వనజ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రం నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. ముందుగా టెక్కె మార్కెట్ యార్డు నుంచి శ్రీనివాస సెంటర్ మీదుగా మున్సిపల్ టౌన్‌హాల్ ఆవరణ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో అక్కినేని వనజ మాట్లాడుతూ దేశంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నా నిరోధించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పార్లమెంట్‌పై ఉన్న ప్రేమ మహిళా బిల్లు చట్టబద్ధత కల్పించటంలో విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవానీ, జయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటుపరం చేస్తే ఊరుకునేది లేదన్నారు. 30 దేశాల్లో 28 శాతం మహిళలు పరిపాలనను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లోపు మహిళా బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరవు నివారించి ఆహార భద్రత కల్పించాలన్నారు. మహిళా సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వాలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాళ్లు విమల, సంధ్యారాణి, పద్మావతి, సుగుణమ్మ, జయలక్ష్మి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, గిడ్డయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి వనజ

కేసీ కెనాల్‌లో ఇద్దరు విద్యార్థులు గల్లంతు


మాల సాయిచరణ్


పవన్‌కుమార్

కర్నూలు: నగరంలోని బుధవారపేటకు చెందిన మాల సాయిచరణ్(14), రాపోగు పవన్‌కుమార్(14) వినాయక ఘాట్ వద్ద కేసీ కెనాల్‌లో మునిగి గల్లంతయ్యారు. తిమ్మప్ప, గోవిందమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. పెద్ద కుమారుడు సాయిచరణ్ కర్నూలు కలెక్టరేట్ వెనుకనున్న ఇందిరా గాంధీ మెమోరియల్ నగరపాలక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి తండ్రి తిమ్మప్ప స్కందాన్షి కార్యాలయంలో ప్రైవేటు ఉద్యోగి. అదే కాలనీ (ఉపాసంపల్లె)కి చెందిన సూరిబాబు, దానమ్మల కుమారుడు పవన్‌కుమార్ అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తండ్రి చనిపోగా తల్లి కూలి పని చేస్తూ జీవనం సాగిస్తోంది. విద్యార్థులిద్దరూ ఒకే కాలనీకి చెందినవారు కావడంతో శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లి పుస్తకాల బ్యాగులు తరగతి గదిలో పెట్టి అదే కాలనీకి చెందిన మరో ఇద్దరితో కలసి సరదాగా ఈత కొట్టేందుకు వినాయక ఘాట్ వద్దకు చేరుకున్నారు. విద్యార్థులిద్దరూ కెనాల్‌లోకి దిగగా వారితో పాటు వచ్చిన మరో ఇద్దరు ఒడ్డునే నిలబడుకున్నారు. కెనాల్‌లో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సాయిచరణ్, పవన్ కుమార్ నీటిలో మునిగి కొట్టుకుపోయారు. వారితో పాటు వెళ్లిన మరో ఇద్దరు నీటిలోకి దిగడానికి భయపడి తిరిగి ఇంటికి వచ్చి జరిగిన ఘటనను విద్యార్థుల తల్లిదండ్రులకు చేరవేయడంతో వారు మూడవ పట్టణ పోలీసులను ఆశ్రయించారు. సీఐ మురళీధర్ రెడ్డితో పాటు ఎస్ఐ రవూఫ్, బ్లూ కోల్ట్స్, క్యూ ఆర్టీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. వినాయక ఘాట్ వద్ద నుంచి జొహరాపురం మీదుగా కేసీ కెనాల్ వెంట పడిదెంపాడు వరకు గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు బంధువులతో కలసి సాయంత్రం వరకు కెనాల్ వెంట గస్తీ తిరిగినప్పటికీ ఫలితం లేకపోయింది.


కుమార్తెకు ఉరేసి దంపతుల ఆత్మహత్య

● ముషీరాబాద్‌లోని గంగపుత్ర కాలనీలో కలకలం
● బిర్లా సైన్స్ సెంటర్‌లోని టికెట్ కౌంటర్‌లో పని చేస్తున్న యువతి
● అర్ధంతరంగా ఉద్యోగం తొలగించడంతో వేదన
● అక్కడ పని చేస్తున్న నలుగురే కక్ష గట్టి తొలగించారని ఆక్రందన
● ‘ఆ నలుగురునీ విడిచిపెట్టవద్దంటూ సూసైడ్‌నోట్
● మృతులు కర్నూలు జిల్లాకు చెందినవారు


కూతురితో సహా ఆత్మహత్య చేసుకున్న దంపతులు

బౌద్ధనగర్(హైదరాబాద్): ‘మేము చావడానికి కారణం ఆ నలుగురే. ఆ నలుగురినీ విడిచిపెట్టకండి’ అని సూసైడ్ నోట్ రాసి నాలుగేళ్ల కూతురుతో సహా దంపతులు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాద ఘటన హైదరాబాద్ వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముషీరాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. కర్నూలు జిల్లా లక్ష్మీపురానికి చెందిన కొప్పుల సాయికృష్ణ (37), చిత్రకళ(30) దంపతులు. వీరికి తేజస్వి అనే నాలుగేళ్ల పాప ఉంది. ఏడాది నుంచి ముషీరాబాద్ గంగపుత్ర కాలనీలో నివసిస్తున్నారు. సాయికృష్ణ గతంలో ర్యాపిడో బైక్ నడిపేవాడు. కానీ ఏడాది కాలంగా ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. భార్య చిత్రకళ నాంపల్లి బిర్లా సైన్స్ సెంటర్‌లోని టికెట్ కౌంటర్‌లో ఉద్యోగం చేస్తుండేది. అయితే అపాయింట్మెంట్ ఆర్డర్, పే స్లిప్ అడిగిన నేపథ్యంలో నెలక్రితం ఆమెను ఆ ఉద్యోగం నుంచి తొలగించారు. భర్తకు పని లేకపోవడం, తనను అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించడాన్ని జీర్ణించుకోలేని చిత్రకళ తీవ్ర మనోవేదనకు గురైంది. లేనిపోని కారణాలు చూపి తనను ఉద్యోగం నుంచి తొలగించిన నలుగురు ఉద్యోగులు శ్యాం కొఠారి, గీతా, హరిబాబు, సంతోష్ రెడ్డిలను వదిలిపెట్టవద్దని సూసైడ్ నోట్‌లో రాసి ఆ నోట్‌ను గోడకు అతికించింది. ముందుగా కూతురుకి ఉరేసి.. ఆ తర్వాత భార్య, భర్త కూడా ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం రాత్రి వారున్న ఇంట్లో నుంచి పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో పక్కింటి వాళ్లు తలుపులు కొట్టినా తీయలేదు. శుక్రవారం ఉదయం ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి తలుపులు బద్దలుగొట్టి చూడగా సాయికృష్ణ, చిత్రకళ, తేజస్వి ముగ్గురు విగతజీవులై కనిపించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కాగా, బిర్లా సైన్స్ సెంటర్‌లో పలు అవకతవకలు జరిగాయని, వాటి గురించి తనకు తెలియడం వల్లనే అక్కడ పని చేసే శ్యామ్ కొఠారి, గీతారావు, హరిబాబు, సంతోష్ రెడ్డిలు కావాలని తనపై తప్పుడు ఆరోపణలు చేసి ఉద్యోగం నుంచి తొలగించారని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. తాను పని చేసిన కార్యాలయంలో రూ.కోట్లలో మోసం జరిగిందని పేర్కొంటూ 12 పాయింట్లతో సూసైడ్ నోట్ రాసి గోడకు అతికించింది. అయితే ఆఫీసులో జరిగిన దానికి కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవడమేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.


ముషీరాబాద్‌లోని గంగపుత్ర కాలనీలోని నివాసం


సూసైడ్ నోట్

మొండి బకాయిలపై కొరడా!

● ఆర్ఆర్ యాక్టు ఉపయోగించేందుకు సిద్ధమైన విద్యుత్ శాఖ అధికారులు
● ఉమ్మడి జిల్లాలో రూ.400 కోట్లకు చేరిన బకాయిలు
● నెల రోజుల్లో చెల్లించని పక్షంలో ఆస్తుల వేలానికి కసరత్తు


బకాయి ఉన్న పరిశ్రమ గేటుకు నోటీసు అతికించిన ఎస్ఈ ఉమాపతి, విద్యుత్ అధికారులు (ఫైల్)

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బకాయిలపై ఆ సంస్థ కొరడా ఝుళిపిస్తోంది. మొండి బకాయి ఉన్న వినియోగదారుల ఆస్తులు జప్తు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లుల వసూలుకు చర్యలు తీసుకుంటోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అన్ని కేటగిరీల్లో 16.54 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో లో టెన్షన్ (ఎల్‌టీ) కనెక్షన్లు అత్యధికంగా ఉన్నాయి. హై టెన్షన్ (హెచ్‌టీ) కనెక్షన్లు 694 ఉన్నాయి. ఎల్‌టీ సర్వీసుల్లో 95 శాతం బిల్లులు నెలనెలా వసూలవుతున్నాయి. కొన్ని హెచ్‌టీ కనెక్షన్లకు సంబంధించిన బకాయి మాత్రం రావడం లేదు. తీవ్ర నష్టాల్లో ఉన్న సంస్థకు ఇవి భారంగా మారడంతో వీటిని వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పలుసార్లు హెచ్చరికలు జారీ చేసినా స్పందించకపోవడంతో రెవెన్యూ రికవరీ చట్టం (ఆర్ఆర్ ఆక్టు) అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. స్థానిక రెవెన్యూ అధికారుల సహాయంతో ఆస్తులు జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నోటీసులు సిద్ధం

కల్లూరు మండలం లక్ష్మీపురంలోని శ్రీ బాలాజీ టీఎంటీ రాడ్ మిల్స్ నుంచి రూ.4.62కోట్ల బకాయి రాబట్టేందుకు ఇటీవలే నోటీసులు జారీ చేశారు. తాజాగా మరో 21 మంది పరిశ్రమ యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పరిశ్రమల నుంచి రూ.400కోట్ల బకాయి వసూలు కావాల్సి ఉంది. హెచ్‌టీ కింద కనెక్షన్లు తీసుకొని, వేల యూనిట్లు వినియోగించుకున్నా తగిన బిల్లులు చెల్లించకపోవడంతో వాటిని మొండి బకాయిలుగా నిర్ధారించారు. ఆయా పరిశ్రమల ఆస్తులను వేలం వేసి, వచ్చిన నగదుతో బిల్లుల కింద జమ చేసుకునే చర్యలు చేపట్టారు. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారం అందించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు. సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు.

నెల రోజుల్లోపు చెల్లించాలి

ప్రతి నెలా ఇచ్చే డిమాండ్ నోటీసులకు స్పందిచకపోవడంతో ఫాం–ఏ, ఫాం–బీతోపాటు ఫైనల్ నోటీసుగా ఫాం–సీని కూడా జారీ చేయనున్నారు. ఆర్ఆర్ ఆక్టు ప్రయోగంలో భాగంగా ఇప్పటికే ఎస్ఈ, ఎస్ఏఓ, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయా సంస్థలకు నోటీసుల అంటించారు. నెల రోజుల్లోపు బిల్లు చెల్లించాలని, లేనిపక్షంలో ఆస్తులు జప్తు చేస్తామని అందులో పేర్కొన్నారు.

ఒక్క రూపాయి బకాయి ఉన్నా చెల్లించాల్సిందే

విద్యుత్ బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే పలుసార్లు హెచ్చరికలు జారీ చేసినా స్పందించని పరిశ్రమలకు ఫామ్–బీ నోటీసు అంటించాం. నిర్ణీత గడువు లోపు స్పందించకపోతే ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆస్తులు జప్తు చేస్తాం. ఒక్క రూపాయి బకాయి ఉన్నా చెల్లించాల్సిందే.

– ఎం. ఉమాపతి, ఎస్ఈ, కర్నూలు